# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 13-05-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పలు శాఖలపై సమీక్ష నిర్వహిస్తున్నారు.**
2. **పశుసంవర్ధక రంగంలో నూతన సాంకేతికత ద్వారా అధిక దిగుబడులను సాధించవచ్చని ఆ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.**
3. **జలవనరుల శాఖ పనులు, మరమ్మత్తుల కోసం ప్రభుత్వం 344 కోట్ల రూపాయలు మంజూరు చేసిందని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.**
4. **పొగాకు పంటకు సరైన ధర లభించేలా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడించారు.**
5. **సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ -సిబిఎస్సి 12వ తరగతి ఫలితాలు ఈరోజు విడుదలయ్యాయి.**

=========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పలు శాఖలపై సమీక్ష నిర్వహిస్తున్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరుగుతున్న ఈ సమావేశంలో ముఖ్యమంత్రి ఆదాయార్జన శాఖలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నారు. కాగా.. ఈ మధ్యాహ్నం వ్యవసాయ, దాని అనుబంధ రంగాలపై సమీక్ష నిర్వహిస్తారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

-------------------------

పశుసంవర్ధక రంగంలో నూతన సాంకేతికత ద్వారా అధిక దిగుబడులను సాధించవచ్చని ఆ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో ఈరోజు జరిగిన 'పశుసంవర్ధక శాఖ కృత్రిమమేధ సాంకేతికత-2.ఓ' కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

..వాయిస్.. 30 సెకన్లు

-------------------------

ఆపరేషన్ సిందూర్‌లో ధైర్యసాహసాలను ప్రదర్శించిన దేశ సైన్యానికి, కేంద్ర ప్రభుత్వానికి దైవబలం మెండుగా ఉండాలని కోరుతూ జనసేన పార్టీ ఆధ్వర్యంలో షష్ఠ షణ్ముఖ క్షేత్రాలు, ఇతర ఆలయాల్లో ఈ రోజు పూజలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా విజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో

పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ప్రత్యేక పూజలు చేశారు. అలాగే కర్ణాటకలోని ఘాటీ సుబ్రహ్మణ్య క్షేత్రంలో రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో అర్చన, అభిషేకాలు, కల్యాణోత్సవం నిర్వహించారు. దేశ సైన్యానికి దైవబలం ఉండాలని ప్రార్థించారు.

---------------------------

పొగాకు పంటకు సరైన ధర లభించేలా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో పొగాకు కొనుగోళ్ళు, ధరలపై కొనుగోలు సంస్థల ప్రతినిధులు, రైతులతో మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామితో కలిసి, ఆయన నిన్న ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం రవికుమార్ పాత్రికేయులతో మాట్లాడుతూ, అంతర్జాతీయంగా పొగాకు పంట ఎక్కువగా ఉత్పత్తి కావడంతో ధరలు తక్కువగా ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో రైతులకు ఎటువంటి నష్టం జరుగకుండా సంస్థలే కొనుగోళ్ళు చేపట్టాలని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ 34 సెకన్లు

---------------------------

కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అత్యవసర, ఉద్రిక్త పరిస్థితులు, విపత్తు సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఈ రోజు, రేపు పలు జిల్లాల్లో పౌర రక్షణ విన్యాసాలను నిర్వహిస్తున్నామని విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ కూర్మనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈరోజు విజయనగరం, ఏలూరు, ప్రకాశం, వైయస్సార్ కడప జిల్లాల్లో, రేపు పార్వతీపురం మన్యం, అనకాపల్లి, పశ్చిమగోదావరి, గుంటూరు, పల్నాడు, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, అన్నమయ్య, అనంతపురం జిల్లాల్లో విపత్తు నిర్వహణతో సంబంధమున్న విభాగాలన్నీ అత్యవసర పరిస్థితుల్లో చేపట్టాల్సిన కార్యకలాపాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాయని ఆయన తెలిపారు. అలాగే ఈ నెల 16న కాకినాడ, చిత్తూరు జిల్లాల్లో సంక్షోభ సమయాల్లో ప్రజలు ఎలా స్పందిస్తే ప్రమాదాలను నివారించవచ్చనే దానిపై మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహించి భద్రతపై అవగాహన కల్పిస్తామని కూర్మనాథ్ చెప్పారు.

---------------------------

జలవనరుల శాఖ పనుల నిర్వహణ, మరమ్మత్తుల కోసం రాష్ట్ర ప్రభుత్వం 344 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసిందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. అమరావతిలో మంత్రి ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ, తూడు, గుర్రపుడెక్క, పూడికతీత వంటి అత్యవసర పనులు కోసం కాలయాపన లేకుండా, 7 రోజుల్లోనే పూర్తయ్యేలా టెండర్లు పిలవనున్నామని తెలిపారు ఈ నెలాఖరు నాటికి పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించామని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ 30 సెకన్లు

---------------------------

పల్నాడుజిల్లాలో ఈ ఉదయం జరిగిన రహదారి ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. జిల్లాలోని గుంటూరు– కర్నూలు జాతీయ రహదారి వినుకొండ మండలం శివాపురం వద్ద లారీని మినీ లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగిందని అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో ఇద్దరు మహిళలు అక్కడికక్కడే మృతి చెందగా.. ఆసుపత్రికి తరలిస్తుండగా మరో ఇద్దరు మృతి చెందినట్లు చెప్పారు. మృతులు ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం మండలం గడ్డమీదపల్లి గ్రామానికి చెందినవారిగా గుర్తించామని అధికారులు తెలిపారు.

---------------------------

దేశవ్యాప్తంగా సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ –సిబిఎస్సి 12వ తరగతి ఫలితాలని ఈ ఉదయం వెల్లడించింది. విద్యార్థులు తమ ఫలితాలను cbse.gov.in, cbseresults.nic.in వెబ్‌సైట్‌ల ద్వారా తెలుసుకోవచ్చని అధికారులు తెలిపారు. రోల్ నంబర్, పుట్టిన తేదీ, పాఠశాల నంబర్, అడ్మిట్ కార్డు నంబర్‌లను నమోదు చేయడం ద్వారా ఫలితాలను చూడవచ్చని తెలిపారు. కాగా ఈరోజు విడుదలైన ఫలితాలలో విజయవాడ 99.60% ఉత్తీర్ణతతో అగ్రస్థానంలో ఉండగా, తిరువనంతపురం 99.32%తో రెండవ స్థానంలో ఉంది. చెన్నై 97.39%తో మూడవ స్థానంలో నిలిచాయని సిబిఎస్సి తెలిపింది

---------------------------

రాష్ట్రంలో పదవ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల హాల్‌టికెట్లను విద్యా శాఖ అందుబాటులోకి తెచ్చింది. విద్యార్థుల హాల్‌టికెట్లు bse.ap.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని అధికారులు తెలిపారు. విద్యార్థులు తమ వివరాలను నమోదు చేసి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, అలాగే, మన మిత్ర ద్వారా వాట్సప్‌లోనూ హాల్‌టికెట్లు పొందవచ్చని అధికారులు సూచించారు.

కాగా ఈ నెల 19 నుంచి 28వ తేదీ వరకు ఉదయం 9 గంటల 30 నిమిషాల నుంచి మధ్యాహ్నం 12 గంటల 45 నిమిషాల వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి.

---------------------------

దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమర జవానుల సంతానాన్ని గౌరవించుకునేందుకు ప్రతి సంవత్సరం మే 13న అమర సైనికుల పిల్లల దినోత్సవం 'చిల్డ్రన్ ఆఫ్ ఫాలెన్ పేట్రియాట్స్ డే'గా నిర్వహిస్తుంటారు. యుద్ధాలు, పోరాటాల్లో అమర వీరులైనవారి పిల్లల త్యాగాలను, వారికి తగిన సాయం అందాల్సిన అవసరాన్ని గుర్తు చేసుకుంటూ ఈరోజును నిర్వహిస్తారు. ఈ పిల్లలు తమ విద్యా లక్ష్యాలను సాధించడంలో సహాయపడటానికి చిల్డ్రన్ ఆఫ్ ఫాలెన్ పేట్రియాట్స్ ఫౌండేషన్ ఉపకారవేతనాలు, విద్యా కౌన్సెలింగ్‌ను అందిస్తుంది.

---------------------------

అన్ని విభాగాల సమిష్టి కృషితో విజయనగరం జిల్లా అభివృద్ధికి కృషిచేయాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వంగలపూడి అనిత కోరారు. విజయనగరం కలెక్టర్ కార్యాలయంలో నిన్న నిర్వహించిన జిల్లా అభివృద్ధి మండలి –డిఆర్‌సి సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈ సమావేశంలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యల ప్రగతిపై వచ్చే సమావేశాల్లో తెలియజేయాలని ఆదేశించారు. జిల్లాలో ఉన్న సహజవనరులను పూర్తి స్థాయిలో, వినియోగించుకొని తలసరి ఆదాయాన్ని పెంచాలని మంత్రి సూచించారు.

---------------------------

సుప్రసిద్ధ భారతీయ రచయిత, పద్మ విభూషణ్ పురస్కార గ్రహీత ఆర్.కె. నారాయణ్ పేరుతో సుపరిచితులైన "రాసిపురం కృష్ణస్వామి అయ్యర్ నారాయణస్వామి వర్ధంతి" ఈరోజు. మాల్గుడి అనే ఒక కాల్పనిక పట్టణంలోని ప్రజలు, వారి ఆచార వ్యవహారాల గురించి ఆయన రాసిన ధారావాహిక నవలలు, కథలు ప్రజలను అమితంగా ఆకర్షించాయి. రచనా వ్యాసంగంలో ఆయన ప్రదర్శించిన ప్రతిభకు అనేక గౌరవ పురస్కారాలు లభించాయి. 1980 సంవత్సరంలో రాయల్ సొసైటీ ఆఫ్ లిటరేచర్ సంస్థ ఆర్.కె. నారాయణ్‌ను ఏ.సి.బెన్సన్ పతకంతో సత్కరించింది. 1906 అక్టోబర్ 10వ తేదీన జన్మించిన ఆయన... 2001 మే 13వ తేదీన కన్నుమూశారు.

=====================